క్లుప్తంగా

'అనుచిత వ్యాఖ్యలు తగదు'

భీమారం: చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిపై సోషల్‌మీడియాలో బీఆర్‌ఎస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని కాంగ్రెస్ నాయకులు తైనేని రవి, బూనేని సుధాకర్, కోట రమేశ్ హితవు పలికారు. శుక్రవారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. అటవీశాఖ అనుమతులు లేని కారణంగా ఇన్నాళ్లు నిలిచిన భీమారం–చెన్నూరు మధ్య జోడు వాగుల వద్ద రోడ్డు నిర్మాణంపై ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి అనుమతులు తీసుకువచ్చారని వివరించారు. నాయకులు ఆవిడపు రవితేజ, కే నరేశ్ పాల్గొన్నారు.

18న సర్వసభ్య సమావేశం

జన్నారం: ఈనెల 18న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శశికళ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా శాఖల అధికారులు తమ నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని సూచించారు. సభ్యులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కబ్జా కాకుండా చూడాలి

దండేపల్లి: మండలంలోని ఏజెన్సీ గ్రామాల్లో చెరువు శిఖం భూములు కబ్జాకు గురికాకుండా చూడాలని బహుజన రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ కోరారు. ఈ మేరకు శుక్రవారం మంచిర్యాలలో అదనపు కలెక్టర్ మోతీలాల్‌కు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. అధికారులు దృష్టిసారించి చెరువులను మరమ్మతు చేయాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థికి సన్మానం



విద్యార్థిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి రిత్విక్ వార్షిక పరీక్షలో 9.0జీపీఏ సాధించగా ఉపాధ్యాయులు అతడిని శుక్రవారం సన్మానించారు. హెచ్‌ఎం సీహెచ్ సునంద రూ.3వేల నగదు ప్రోత్సాహకం అందించనున్నట్లు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత



బాధితులకు సాయమందిస్తున్న పెద్దలు

మందమర్రిరూరల్: పట్టణంలోని బస్టాండ్ ఏరియాకు చెందిన పేరాల (టీస్టాల్) శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి పలువురు ఆర్థిక సాయం అందించారు. సిరిపురం మల్లయ్య, అరుణోదయ సమ్మిరెడ్డి, గజెల్లి లక్ష్మణ్, నాగులు దుర్గయ్య, ఫొటో స్టూడియో తిరుపతి, ఎండీ పాషా సేకరించిన రూ.10వేలను శుక్రవారం శ్రీనివాస్ కుటుంబానికి అందజేశారు.

బాధిత కుటుంబానికి పూర్వ విద్యార్థుల ఆర్థికసాయం

రామకృష్ణాపూర్: పట్టణంలోని సీవీ రామన్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన కొత్వాల్ సురేందర్ కుటుంబానికి పాఠశాల పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆర్థికసాయాన్ని అందించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయుడి కుటుంబానికి అండగా నిలువాలని రూ.లక్షా 25వేలు అందించినట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

చెన్నూర్‌రూరల్/భీమారం: కిష్టంపేట 132కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా పొక్కూరు, దుగ్నెపల్లి, కొమ్మెర గ్రామాల్లోని సబ్‌స్టేషన్ల పరిధిలోగల గ్రామాల్లో శనివారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ భాస్కర్ తెలిపారు. అలాగే కిష్టంపేట 132 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని భీమారం, కొమ్మెర 33కేవీ/11 కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలోగల గ్రామాలకు ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెన్నూరు ఏడీఏ రవికుమార్ తెలిపారు. కిష్టంపేట నుంచి భీమారం వచ్చే ఫీడర్‌ను కొమ్మెర ఫీడర్ నుంచి వేరుచేసే పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.

లోవోల్టేజ్ నివారణకు చర్యలు

మందమర్రిరూరల్: మందమర్రిలో విద్యుత్ లోవోల్టేజ్ సమస్య నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. పలు గ్రామాల్లో అధిక లోడ్ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించారు. అదనంగా నాలుగు 25కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు విద్యుత్‌శాఖ ఏఈ మల్లేశం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

సింగిల్ రోడ్డు.. డబుల్ కష్టాలు



భీమారం-కొత్తపల్లి సింగిల్ రోడ్డు

- రద్దీగా భీమారం–కొత్తపల్లి రోడ్డు
- పెరిగిన వాహనాల రాకపోకలు
- రోడ్డు విస్తరణపై పట్టింపు కరువు
- ఇబ్బందుల్లో వాహనచోదకులు



అంకుసాపూర్‌వద్ద ఇరుకు కల్వర్టు

భీమారం: మండలంలోని భీమారం–కొత్తపల్లి సింగిల్ రోడ్డుపై వాహనాల రాకపోకలకు ఇబ్బందులేర్పడుతున్నాయి. 20 ఏళ్ల క్రితం మట్టిరోడ్డుగా ఉన్న దీన్ని 10కిలో మీటర్ల మేర బీటీ రోడ్డుగా అప్పటి ప్రభుత్వం అభివృద్ధి చేసింది. అప్పటి అవసరాలకు సింగిల్ రోడ్డు ఎంతో ఉపయోగపడింది. కానీ.. ప్రస్తుతం ట్రాఫిక్ పెరిగింది. దీంతో ఈ ప్రధాన రహదారిపై వాహనాల సంఖ్య ఎక్కువైంది. ఈ కారణంగా వాహనచోదకులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఈ సింగిల్ రోడ్డును డబుల్‌రోడ్డుగా అభివృద్ధి చేయాలని కొన్నేళ్లుగా ప్రభుత్వానికి ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. అయినా ప్రభుత్వం గాని, పాలకులు గాని పట్టించుకున్న పాపాన పోలేదు.

నిత్యం రద్దీగా మారి..

భీమారం నుంచి అంకుసాపూర్, ఆరెపల్లి, మద్దికల్ మీదుగా కొత్తపల్లి వరకు నిర్మించిన ఈ రోడ్డు కీలకంగా మారింది. వ్యవసాయమే ప్రధాన వృత్తిగా జీవనోపాధి పొందుతున్న ఈ ప్రాంత రైతులు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ రోడ్డే ప్రధానం. పండించిన పంటలు ఇతర ప్రాంతాల్లో విక్రయించాలన్నా.. ఇతర ప్రాంతాల నుంచి ఎరువులు తెచ్చుకోవాలన్నా ఈ రోడ్డే కీలకం. కానీ.. ప్రస్తుత వాహనాల రద్దీకి సింగిల్ రోడ్డు బిజీగా మారింది. ఒక వాహనానికి ఎదురుగా మరో వాహనం వస్తే ఇబ్బందులేర్పడుతున్నాయి. వానాకాలంలో సమస్య తీవ్రంగా ఉంటోంది. సింగిల్‌రోడ్డు కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

లోడుతో వెళ్తే ఇబ్బందే..



భీమారం నుంచి కొత్తపల్లి మార్గంలో లోడుతో వాహనాలు వెళ్తే ఇబ్బందులేర్పడుతున్నాయి. సింగిల్ రోడ్డు కావడంతో ఎదురుగా వాహనం వస్తే కిందికి దిగే అవకాశం కూడా లేదు. దీంతో టైం వృథా అవుతోంది. ప్రభుత్వం ఈరోడ్డును పరిశీలించి రెండువరుసల రహదారిగా అభివృద్ధి చేసి సమస్య పరిష్కరించాలి.

– మహబూబ్, టాటా ఏస్ ట్రాలీ డ్రైవర్

ప్రతిపాదనలు పంపిస్తాం



కొత్తపల్లి వరకు డబుల్ రోడ్డు నిర్మించాలనే ప్రజల డిమాండ్‌ను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. మండలానికి భీమారం–కొత్తపల్లి, భీమారం–ధర్మారం ప్రధాన రహదారులున్నాయి. ఇందులో ధర్మారం రోడ్డులో కొంతమేర డబుల్ రోడ్డు ఉంది. డబుల్‌రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం.

– రాధారాథోడ్, ఎంపీడీవో, భీమారం

డబుల్ రోడ్డు నిర్మిస్తే..

భీమారం–కొత్తపల్లి వరకు డబుల్ రోడ్డు నిర్మించి చెన్నూరు మండలంలోని గంగారం నుంచి అస్నాద్ రోడ్డు వరకు కలిపితే రెండు మండలాల మధ్య రవాణా సదుపాయాలు మెరుగుపడనున్నాయి. చెన్నూరు మండలం అస్నాద్ రోడ్డు నుంచి గంగారం మీదుగా కొత్తపల్లి వరకు కూడా ఇప్పటికే సింగిల్ రోడ్డు ఉంది. దీనిని డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేయాలనే డిమాండ్ కూడా ఉంది. ఒకప్పుడున్న సింగిల్ రోడ్డు కారణంగా రాకపోకలకు ఇబ్బందిగా మారిందని మద్దికల్, ఆరెపల్లి, కొత్తపల్లి, అంకుసాపూర్ గ్రామాల ప్రజలు వాపోతున్నారు. గతంలో వాహనాల సంఖ్య తక్కువగా ఉండి రాకపోకలు సాఫీగా సాగేవని తెలిపారు. ప్రస్తుతం ట్రాక్టర్లు, ట్రాలీలు, కార్లు, బైక్‌ల సంఖ్య పెరిగి రోడ్డు రద్దీగా మారిందని పేర్కొన్నారు. వాహనాల రద్దీకి తగినట్లు రోడ్డును విస్తరిస్తే బాగుంటుందని కోరుతున్నారు.

సామూహిక అక్షరాభ్యాసం



చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న టీచర్లు

దండేపల్లి: బడిబాటలో భాగంగా మండలంలోని మామిడిపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కొత్తగా అడ్మిషన్ పొందిన చిన్నారులతో హెచ్‌ఎం కవిత అక్షరాభ్యాసం చేయించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, అంగన్‌వాడీ టీచర్లు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీ పరిధి నల్లగొండ పోచమ్మవాడలోగల మండల ప్రాథమిక పాఠశాలలో బడిబాటలో భాగంగా అడ్మిషన్ పొందిన చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఎస్పీవాడ పాఠశాలలో 22 మంది విద్యార్థులు ఒకటో తరగతిలో ప్రవేశం పొందారని ఎంఈవో రాధాకృష్ణమూర్తి తెలిపారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి ఎంపీఎం గోపాల్, హెచ్‌ఎంలు మహేశ్వర్‌రెడ్డి, తిరుపతయ్య, మహేశ్వర్‌రెడ్డి, రవీందర్, అన్నపూర్ణ, వీణ పాల్గొన్నారు.

బోరు పనులు ప్రారంభం

చెన్నూర్‌రూరల్: మండలంలోని కన్నెపల్లి గ్రామంలో శుక్రవారం బోరు నిర్మాణ పనులు ప్రారంభించారు. గ్రామానికి మిషన్ భగీరథ నీరు రావడం లేదని గ్రామస్తులు అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే గడ్డం వివేక్ దృష్టికి తీసుకువెళ్లగా ఇచ్చిన హామీ మేరకు బోరు మంజూరు చేశారు. కాంగ్రెస్ నాయకులు హేమంత్‌రెడ్డి, సుశీల్‌కుమార్ పాల్గొన్నారు.

చెరువులోని మురుగునీరు తొలగించాలి

మంచిర్యాలటౌన్: రాముని చెరువు నుంచి వెలువడుతున్న దుర్గంధానికి కారణమైన మురుగునీటిని తొలగించాలని రాముని చెరువు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులతో చెరువు వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ.. చెరువులో పేరుకుపోయిన పూడిక తొలగించాలని, అక్రమార్కుల నుంచి చెరువు కట్టను కాపాడాలని కోరారు. చెరువు సుందరీకరణ, అభివృద్ధి పనులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, ఉపాధ్యక్షులు చింతకింది రమేశ్, తాలిబ్‌ఖాన్, సలహాదారులు డాక్టర్ విశ్వేశ్వర్‌రావు, ఎం.రంగారావు, శ్రీనివాస్‌రెడ్డి, జీ సత్యనారాయణమూర్తి, ఒజ్జెల మనోహర్, కార్యవర్గ సభ్యులు అంకం చంద్రయ్య, కే హేమాజీ, సలీమ్ పాషా, కే రామస్వామి, వెంకటేశ్వర్లు, కే లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న అసోసియేషన్ సభ్యులు

అందుబాటులో ఎరువులు

వేమనపల్లి: రైతుల ఆందోళనకు ఫలితం దక్కింది. మూడు రోజుల క్రితం ఎరువుల కావాలని రైతులు రాస్తారోకో చేశారు. దీంతో అన్ని ఎరువుల దుకాణాలకు యూరియా, కాంప్లెక్స్ ఎరువులు చేరుకున్నాయి. నీల్వాయిలోని వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో 20 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీకి సిద్ధంగా ఉంది. మండల కేంద్రంలోని హాకా రైతు సేవా కేంద్రంలో డీఏపీ, అన్ని గ్రామాల డీలర్ల వద్ద యూరియా అందుబాటులో ఉన్నట్లు ఏవో వీరన్న తెలిపారు. మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను ఆయన సందర్శించి స్టాక్ వివరాలు తెలుసుకున్నారు.



దుకాణంలో అందుబాటులో ఎరువులు

రీవెరిఫికేషన్‌లో పెరిగిన జీపీఏ

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని తొగరి శ్రద్ధకు వార్షిక పరీక్షాఫలితాల్లో 9.7 జీపీఏ వచ్చింది. పరీక్షలు బాగా రాసిన తనకు తక్కువ జీపీఏ వచ్చిందని అనుమానంతో రీవెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకుంది. రీవెరిఫికేషన్ అనంతరం శ్రద్ధకు 10జీపీఏ వచ్చినట్లు విద్యాశాఖ అడిషనల్ జాయింట్ సెక్రటరీ నుంచి పాఠశాలకు మెమో వచ్చినట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి తెలిపారు. 2023–24 విద్యాసంవత్సరంలో ముగ్గురు విద్యార్థులు 10జీపీఏ సాధించినట్లు పేర్కొన్నారు.

కేజీబీవీ విద్యార్థినికి కూడా..

కోటపల్లి: కోటపల్లి కేజీబీవీకి చెందిన పదో తరగతి విద్యార్థిని జెల్ల సంధ్యారాణికి 9.5 జీపీఏ వచ్చింది. తనకు జీపీఏ తక్కువ వచ్చిందని అనుమానించిన సంధ్యారాణి ఎస్వో హరిత దృష్టికి తీసుకువెళ్లగా తెలుగు సబ్జెక్ట్ రీవాల్యుయేషన్ పెట్టించారు. రీవాల్యుయేషన్ అనంతరం తెలుగు సబ్జెక్టులో 10 జీపీఏ వచ్చింది. దీంతో సంధ్యారాణికి అన్ని సబ్జెక్టులు కలిపి 9.7 జీపీఏ రాగా పాఠశాల టాపర్‌గా నిలిచింది.

'భగీరథ' సర్వే పరిశీలన

జైపూర్: మండలంలోని గంగిపల్లి, కిష్టాపూర్ గ్రామాల్లో ఇంటింటా చేపట్టిన మిషన్ భగీరథ సర్వేను శుక్రవారం డీఎల్పీవో ధర్మరాణి పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆమె వెంట ఎంపీవో అనిల్‌కుమార్ తదితరులున్నారు.



కిష్టాపూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న ధర్మరాణి

పుస్తకాలు, యూనిఫాంల పంపిణీ

నెన్నెల: మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థినులకు ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్యామల శుక్రవారం పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో సకల సదుపాయాలున్నాయని, వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎన్‌ఓ ప్రకాశ్‌రావు, ఎంపీటీసీ సభ్యులు తిరుపతి, హరీశ్‌గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గట్టు మల్లేశ్, నాయకులు తోట శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, ఎస్వో కవిత తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

స్థల పరిశీలన

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో వ్యాపార సముదాయాల ఏర్పాటుకు శుక్రవారం అధికారులు స్థల పరిశీలన చేశారు. స్థానిక సూపర్‌బజార్, బీజోన్ ఏరియాలో రూ.9.50 లక్షలతో 25 వ్యాపార సముదాయాల నిర్మాణ పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, ఏఈ అచ్యుత్, మున్సిపల్ వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి తదితరులున్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: దండేపల్లి మండలం ముత్యంపేట మెయిన్‌రోడ్డుకు ఆనుకుని ఉన్న చెరువు శిఖం భూమిని కబ్జాచేసి ఇళ్ల నిర్మాణం చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌కేఎస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ శుక్రవారం అదనపు కలెక్టర్ మోతీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. 1/70 ఏజెన్సీ చట్టానికి తూట్లు పొడుస్తున్న భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

మందమర్రిరూరల్: మందమర్రిలో గత ప్రభుత్వం జారీ చేసిన అంత్యోదయ కార్డులపై విచారణ చేపట్టి అనర్హుల కార్డులు రద్దు చేయాలని టీడీపీ పట్టణాధ్యక్షుడు వాసాల సంపత్ డిమాండ్ చేశారు. శుక్రవారం మంచిర్యాల అదనపు కలెక్టర్ మోతీలాల్ నాయక్‌కు వినతిపత్రం అందించారు. అర్హులకు కార్డులు జారీ చేయాలని కోరారు. ఆయన వెంట నాయకుడు గొల్లపల్లి ఓదెలు ఉన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

భీమిని: భీమిని, కన్నెపల్లి మండలాల్లోని గ్రామపంచాయతీల్లో శుక్రవారం డ్రైడే నిర్వహించారు. అధికారులు ర్యాలీగా వెళ్లి ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. నీరు నిల్వ ఉండకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు సూచించారు. కార్యక్రమాల్లో ఎంపీవో సబ్బర్‌అలీ, పీహెచ్‌సీ వైద్యాధికారి కృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ అంజన్న, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఫీజు రాయితీ ఇవ్వాలి

మంచిర్యాలఅర్బన్: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు 100శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం డీఈవో యాదయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మల్లేశ్, సత్తయ్య, రాజేశ్, జీవన్ తదితరులున్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

వేమనపల్లి: మండలంలోని నీల్వాయి, కేతన్‌పల్లి, ముల్కలపేట గ్రామపంచాయతీల పరిధిలో చేపట్టిన పారిశుధ్య నిర్వహణ పనులను శుక్రవారం ఎంపీవో బాపురావు పరిశీలించారు. రోడ్లు, డ్రైనేజీల్లో చెత్త లేకుండా చూడాలని, గ్రామాల్లో మిషన్ భగీరథ సర్వే ముమ్మరంగా చేపట్టాలని సూచించారు. ఆయన వెంట కార్యదర్శులు అశోక్, జాఫర్ అలీ, ఎఫ్‌ఏలు కిషన్, శంకర్ ఉన్నారు.

గీత కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

జైపూర్: ఈ నెల 9న తాటి చెట్టు పైనుంచి పడి తీవ్రంగా గాయపడ్డ కిష్టాపూర్‌కు చెందిన గీత కార్మికుడు బొంగోని రమేశ్‌గౌడ్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని స్థానిక గీత కార్మికులు కోరారు. రమేశ్‌గౌడ్ మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఆయన పరిస్థితి శుక్రవారం వరకు విషమంగా మారిందని ఆస్పత్రి సిబ్బంది తెలిపినట్లు పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు అతడిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిపారు. ప్రభుత్వం పేద గీత కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలని తోటి కార్మికులు కోరుతున్నారు.

ముసుగు తీసేదెప్పుడో!



పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన మొదటిరోజే వివిధ పార్టీలకు చెందిన నాయకుల విగ్రహాలకు ముసుగులు వేసిన అధికారులు కోడ్ ముగిసినా తొలగించడంలేదు. కోడ్ ముగిసినా జిల్లా కేంద్రంలోని శ్రీశ్రీనగర్‌లో నేటికీ ముసుగు తొలగించని మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహం ఇది.

– మంచిర్యాల టౌన్

'ట్రస్టు సేవలు కొనసాగుతాయి'

మంచిర్యాలటౌన్: తన తండ్రి కొక్కిరాల రఘుపతి రావు చారిటబుల్ ట్రస్టు ద్వారా పదేళ్లపాటు సేవా కార్యక్రమాలు కొనసాగించనున్నట్లు ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తన ఇంటి వద్ద ముస్లిం మహిళలకు డీసీసీ అధ్యక్షురాలు సురేఖతో కలిసి బక్రీద్ తోఫా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ కారణంగా రంజాన్ తోఫా ఇవ్వలేకపోయినందునే బక్రీద్‌కు ఇస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో గెలిచినా, ఓడినా చలివేంద్రాలు, అంబలి పంపిణీ, బతుకమ్మ చీరెలు, రంజాన్, బక్రీద్ తోఫాల పంపిణీ కొనసాగిస్తానని చెప్పారు. మున్సిపాలిటీలో ఇరవై ఏళ్లలో నిత్యం తాగునీటిని అందించలేని పాలన కొనసాగిందని, తాను గెలిచిన మూడు నెలల్లోనే నిత్యం తాగునీరు సరఫరా చేయిస్తున్నట్లు తెలిపారు.



మహిళలకు తోఫా ఇస్తున్న ప్రేమ్‌సాగర్‌రావు

పట్టణాభివృద్ధికి నిరంతరం కృషి

నస్పూర్: పట్టణాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ సురిమిల్ల వేణు అధ్యక్షతన నిర్వహించిన సాధారణ కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పారిశుధ్య పనుల్లో అలసత్వం వహించరాదని సూచించారు. శిథిలావస్థలోని విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని, ప్రతిరోజూ ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు సరఫరా అయ్యేలా చూడాలని తెలిపారు. అనంతరం ఎజెండాలో పొందుపర్చిన 20 అంశాలపై కౌన్సిల్ సభ్యులు చర్చించి వాటిని ఏకగ్రీవంగా ఆమోదించారు. వైస్ చైర్‌పర్సన్ గెల్లు రజిత, కమిషనర్ సతీశ్, తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్వో సతీశ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సబ్‌పోస్టాఫీస్‌లో సిబ్బంది కొరత

దండేపల్లి: మండల కేంద్రంలోని సబ్‌పోస్టాఫీస్‌లో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఈ సబ్‌పోస్టాఫీస్ పరిధిలో తొమ్మిది బ్రాంచ్‌లున్నాయి. వాటిలో తొమ్మిదిమంది బీపీఎంలు, ముగ్గురు డాక్‌సేవక్‌లు పనిచేయాల్సి ఉంది. ఇందులో తాళ్లపేట, ద్వారక బీపీఎంలు సస్పెండయ్యారు. వెంకటాపూర్ బీపీఎం బదిలీపై వెళ్లారు. దీంతో ఈ మూడు బీపీఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దండేపల్లిలో రెండు డాక్‌సేవక్, వెంకటాపూర్‌లో డాక్‌సేవక్ మొత్తం మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో బీపీఎంలు, డాక్‌సేవక్‌లు లేని గ్రామాల్లో సేవలకు ఇబ్బందులేర్పడుతున్నాయి. తపాలాశాఖ ఉన్నతాధికారులు స్పందించి ఖాళీలను భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అందని సేవలు

కొత్త ఆధార్ కార్డులు, పాన్‌కార్డులు, కాల్‌లెటర్స్, స్టడీమెటీరియల్, కొరియర్స్ పోస్టు ద్వారా వస్తున్నప్పటికీ బీపీఎంలు, డాక్‌సేవక్‌లు లేని గ్రామాల్లో అవి ప్రజలకు చేరవేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. చిన్న పిల్లలకు ఆధార్ కార్డులు తీయించినా అవి అందడం లేదు. సిబ్బంది కొరతతో ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్ (ఐపీబీ) సేవలతోపాటు ఆసరా పింఛన్ల పంపిణీ, ఉపాధి కూలీలకు వేతనాల చెల్లింపులు, బాల ఆధార్, ఆధార్‌కు ఫోన్ నంబర్ లింక్ చేయడం, పీఎల్ఐ, ఆర్‌పీఎల్ఐ, ఆర్డీ తదితర సేవలు అందక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సేవలు పొందాలంటే పొరుగు గ్రామాలకో.. మండల కేంద్రానికో వెళ్లాల్సి వస్తోంది. లేదంటే పక్క గ్రామాల బీపీఎంలు వచ్చి ఇచ్చేదాకా నిరీక్షిస్తున్నారు. దండేపల్లి పోస్ట్‌మాస్టర్ గురువయ్య ఈ విషయమై స్పందిస్తూ.. దండేపల్లి సబ్‌పోస్టాఫీస్ పరిధిలో మూడు బీపీఎంలు, మూడు డాక్‌సేవక్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. సిబ్బంది లేని గ్రామాల్లో ఇబ్బందులు తలెత్తుతున్న మాట వాస్తవమేనని చెప్పారు. సాధ్యమైనంత వరకు ప్రజలకు ఇబ్బంది కలగకుండా సమీప గ్రామాల సిబ్బందిని సర్దుబాటు చేసి సేవలందిస్తున్నట్లు తెలిపారు.



దండేపల్లి సబ్‌పోస్టాఫీస్ కార్యాలయం

గ్రామదేవతలకు ప్రత్యేకపూజలు

కాసిపేట: మండలంలోని పెద్దనపల్లి, నాయకపుగూడలో శుక్రవారం గ్రామదేవతలకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. సమీప వాగు నుంచి నీటిని తీసుకువచ్చి విగ్రహాలను శుద్ధి చేశారు. కరువు కాటకాలు రాకుండా గ్రామస్తులు, పశువులు మంచిగా ఉండాలని, మంచి పంటలు పండాలని కోరుతూ పూజలు నిర్వహించారు. అధికసంఖ్యలో ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



విగ్రహాలను శుద్ధి చేసేందుకు నీటిని తెస్తున్న మహిళలు